7

సాక్షి విశాఖపట్నం

బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



ముస్తాబైన నక్కవానిపాలెం శివాలయం



ఆర్కేబీచ్ వద్ద ఏర్పాటు చేసిన కోటి శివలింగాలు

నేడు మహాకుంభాభిషేకం

బీచ్‌రోడ్డు: మహా శివరాత్రి వేడుకలకు ఆర్.కె.బీచ్ సిద్ధమైంది. డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో 40వ మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహా శివరాత్రి సందర్భంగా 39 ఏళ్లుగా మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి(టీఎస్సార్) తెలిపారు. సిరిపురం సమీపంలోని ఆయన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా నుంచి తీసుకొచ్చిన పవిత్ర జలాలతో ఈ ఏడాది శివ లింగాలకు అభిషేకం చేస్తామన్నారు. బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు పంచామృతం, సుగంధ ద్రవ్యాలు, పళ్ల రసాలతో భక్తులతో స్వయంగా అభిషేకం చేయిస్తామన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు స్వామి కల్యాణం, 4.30 గంటలకు హోమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా మాడుగుల నాగఫణి శర్మకు అవధాన బ్రహ్మ బిరుదు ప్రదానం చేస్తామని, ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం హాజరవుతున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి ప్రఖ్యాత కళాకారుడు గుమ్మడి గోపాలకృష్ణ దర్శకత్వం, పద్య రచనలో 45 మంది కళాకారులతో నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. నంది అవార్డు గ్రహీత శ్రీ వంకాయల మారుతీప్రసాద్ బృందంచే పౌరాణిక నాటిక ప్రదర్శన ఉంటుందని వివరించారు.

ఆర్థిక నిర్ణయాల్లో ఆర్‌బీఐదే కీలకపాత్ర




మాట్లాడుతున్న దువ్వూరి సుబ్బారావు

- రాజకీయాలతోనే కో–ఆపరేటివ్ బ్యాంకులకు ఇబ్బందులు
- ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి

విశాఖ విద్య: దేశ ఆర్థిక సుస్థిరతలో ఆర్‌బీఐ **కీలక** పాత్ర పోషిస్తోందని ఆ సంస్థ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. 'సెంట్రల్ బ్యాంకింగ్‌లో సందిగ్ధతలు– భారతీయ రిజర్వ్ బ్యాంకు ప్రజల రోజువారీ జీవితాలతో ఎలా అనుసంధానమవుతోంది'అనే అంశంపై ఏయూ ప్రాంగణంలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశం ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగించటంలో ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. అందరూ భావిస్తున్నట్లు కరెన్సీ నోట్ల ముద్రణ ఒక్కటే ఆర్‌బీఐ పాత్ర కాదని, మేనేజ్‌మెంట్ చేయడం, మానిటరీ పాలసీలను రూపొందించడంలోనూ ఆర్‌బీఐ నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రజల రోజువారీ జీవనంలో సాగే అన్ని ఆర్థిక పరమైన వ్యవహారాల్లో పరోక్షంగా ఆర్‌బీఐ పాత్ర ఉంటుందని స్పష్టం చేశారు. తాను ఆర్‌బీఐ గవర్నర్‌గా ఉన్న రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో ప్రముఖ సంస్థలు పతనావస్థలో ఉన్నాయని, దీని వల్ల ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలినట్లు తెలిపారు. అటువంటి పరిస్థితుల్లో భారత్‌పై ఆర్థిక మాంద్యం ప్రభావం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆర్‌బీఐ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అయినప్పటికీ, కొన్ని పరిమితులకు లోబడి కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలోని కొన్ని కో–ఆపరేటివ్ బ్యాంకులు రాజకీయాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. రాష్ట్రాల్లో బలమైన వ్యవస్థలు కొనసాగినప్పుడే, ఆర్థికంగా బలోపేతమయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఐడీఎస్ఏపీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ గలాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు
సర్వం సిద్ధం





- ఓటు హక్కు వినియోగించుకోనున్న 22,493 మంది ఉపాధ్యాయులు
- పోలింగ్ నిర్వహణకు 739 మంది సిబ్బంది నియామకం
- మంగళవారం సాయంత్రంతో ముగిసిన ప్రచార పర్వం

పటిష్ట బందోబస్తు

ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ఏజెంట్లు, సిబ్బందితో పాటు ఓటర్లు కేంద్రం లోపలికి సెల్ ఫోన్లు తీసుకెళ్లకూడదు. హోటళ్లు, లాడ్జీలు, ఫంక్షన్ హాళ్లలో ముందస్తు తనిఖీలు నిర్వహించి.. అనుమానిత వ్యక్తులు ఉంటే చర్యలు తీసుకునేలా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రచారపర్వం ముగిసినందున బయట వ్యక్తులు ఉత్తరాంధ్రలో ఉండకూడదని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది.

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఎన్నికల బరిలో 10 మంది అభ్యర్థులు పోటీపడుతుండగా.. ఈ నెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ జరగనుంది. ఉత్తరాంధ్రలో 22,493 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ నిర్వహణకు 739 మంది సిబ్బందిని నియమించారు. భద్రత కోసం 800 మంది పోలీసులు కేంద్రాల వద్ద పహారా కాయనున్నారు. విశాఖ జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు యంత్రాంగం సిద్ధంగా ఉందని, ఆ దిశగా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఏఆర్వో, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, తూర్పు ఏసీపీ లక్ష్మణమూర్తితో కలిసి మంగళవారం మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు.

123 పోలింగ్ కేంద్రాలు.. 739 మంది సిబ్బంది

ఉత్తరాంధ్ర పరిధిలోని 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా 739 మంది అధికారులను, సిబ్బందిని కేటాయించారు. ఇందులో 148 మంది పీవోలు, 148 మంది ఏపీవోలు, 295 మంది ఓపీవోలు 148 మంది మైక్రో అబ్జర్వర్లు ఉన్నారు. ఉత్తరాంధ్ర పరిధిలోని మొత్తం 22,493 మందిలో పురుషులు 13,508, మహిళా ఓటర్లు 8,985 మంది ఉన్నారు. వీరందరికీ ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయ్యింది. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక అవసరాలు గల ఓటర్ల కోసం కేంద్రాల వద్ద వీల్ చైర్లు అందుబాటులోకి ఉంచారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద షామియానాలు, తాగు నీరు, బయో టాయిలెట్లు ఏర్పాటు చేశారు.

ఏయూలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వద్ద డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ అందజేస్తారు. 27వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి పోలింగ్ సిబ్బంది నుంచి రిసెప్షన్ కేంద్రం వద్ద మెటీరియల్ తీసుకుంటారు. మెటీరియల్, సిబ్బందిని తరలించేందుకు అనువుగా తగినన్ని వాహనాలను అందుబాటులో ఉంచారు.


మొత్తం 22,493 మంది ఓటర్లు



మంగళవారం సాయంత్రం 4 గంటలతో ప్రచార పర్వం ముగిసింది. పోలింగ్‌కు 48 గంటల ముందుగానే సైలెంట్ పీరియడ్ అమల్లోకి రావడంతో 144 సెక్షన్ విధించారు. 27వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మార్చి 3న కౌంటింగ్ ప్రక్రియ ఉంటుంది. 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది.

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	మొత్తం ఓటర్లు	పోలింగ్ సిబ్బంది
శ్రీకాకుళం	31	3,416	1,619	5,035	185
విజయనగరం	29	3,270	1,953	5,223	175
పార్వతీపురం మన్యం	15	1,574	759	2,333	90
అల్లూరి సీతారామరాజు	11	920	568	1,488	65
అనకాపల్లి	24	1,789	1,096	2,885	145
విశాఖపట్నం	13	2,539	2,990	5,529	79
మొత్తం	123	13,508	8,989	22,493	739

వాడకం పెరిగితే వాతే..!



- విద్యుత్ వినియోగదారులపై కొత్త భారం
- కొత్త పరికరాలతో లోడ్ పెంచుతున్నారంటూ మెలిక
- కేటగిరీలు మార్చుకోవాలంటూ మార్గదర్శకాలు
- రాయితీల పేరుతో సంపద సృష్టికి గేట్లు తెరిచిన ఈపీడీసీఎల్

సాక్షి, విశాఖపట్నం : ఎండలు మండిపోతున్నాయని ఏసీ కొన్నారా.? అయితే.. మీకు ఫైన్ తప్పదు. దుస్తులు ఉతకలేకపోతున్నామని వాషింగ్ మెషీన్ కొనుక్కున్నారా.? అయితే బాదుడు తప్పదు. మీరు కొత్తగా ఏవైనా గృహ విద్యుత్ పరికరాలు కొనుగోలు చెస్తే తమకు చెప్పాల్సిందే.. లేదంటే తిప్పలు తప్పవని ఏపీఈపీడీసీఎల్ హెచ్చరిస్తోంది. ఇప్పటికే ఎఫ్‌పీపీసీఏ పేరుతో లేనిపోని చార్జీలు విధిస్తున్న కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు మరో గుదిబండని గృహ విద్యుత్ వినియోగదారుల మెడకు కడుతోంది. ఇప్పటికే భారీ బిల్లులు వేస్తూ రక్తం తాగుతున్న ప్రభుత్వం.. ఇప్పుడు అదనపు లోడు క్రమబద్ధీకరణ పేరుతో కొత్త రకం దోపిడీకి తెరతీసింది.

రెగ్యులరైజ్ చేసుకోండి.. లేదంటే.?

సంపద సృష్టించేందుకు ఈపీడీసీఎల్ ఇప్పుడు ఈ 'అదనపు' భారం పేరుతో వినియోగదారుల నుంచి పైసావసూల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అదనపు లోడును స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకోవాలంటూ గృహ విద్యుత్ వినియోగదారులకు ఆదేశాలు జారీ చేస్తోంది. ఇప్పుడు చెల్లింపులు చేస్తే డెవలప్‌మెంట్ చార్జీల్లో రాయితీలు ఇస్తామనీ.. లేదంటే భారీ భారం తప్పదని డిస్కమ్ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఏపీఈఆర్‌సీ ఆదేశాలకు అనుగుణంగా అదనపు లోడును క్రమబద్ధీకరించుకొనే గృహ వినియోగదారులకు మార్చి 1 నుంచి జూన్ 30 వరకూ 50 శాతం రాయితీ ఇస్తామని ప్రకటించారు. వినియోగదారులు విద్యుత్ కనెక్షన్ పొందే సమయంలో తీసుకున్న లోడు కంటే అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలని.. ఒక కిలోవాట్‌కి రూ.2200 (డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2000, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200తో కలిపి) చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారు. స్వచ్ఛందంగా ముందుకు వస్తే.. రూ.2,200 కాకుండా.. కేవలం రూ.1200 మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని.. బంపర్ ఆఫర్ ఇస్తున్నట్లు కలరింగ్ ఇస్తున్నారు. అదేవిధంగా 2 కిలోవాట్ల క్రమబద్ధీకరణకు రూ.4,400 బదులుగా రూ.2400, 3 కిలోవాట్లయితే రూ.6,600కి బదులు రూ.3,600, 4 కిలోవాట్లకు రూ.8,800కి బదులు రూ.4,800 చెల్లించాలంటున్నారు. జూన్ 30లోపు చెల్లించకపోతే.. ఫైన్లు అదనమని అంటున్నారు. ఈపీడీసీఎల్ పరిధిలో ఉన్న 61,12,989 మంది గృహ విద్యుత్ వినియోగదారులు అన్ని ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాలు, ఈపీడీసీఎల్ వెబ్‌సైట్ www.apeasternpower.comలో దరఖాస్తు చేసుకొని పరిశీలించుకోవాలని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. ఇప్పటివరకు 11 జిల్లాల్లో 8,84,116 కిలోవాట్లను క్రమబద్ధీకరించుకోవలసిన 8,35,755 సర్వీసులను గుర్తించారు. వీరందరిపైనా చార్జీల అదనపు లోడు పడనుంది.

హెచ్చుతగ్గులతో సమస్యలు

కొత్తగా మీటరు కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో కేటగిరి–1, కేటగిరి–2గా విభజించి విద్యుత్ కనెక్షన్ ఇస్తారు. దీని ప్రకారం సరఫరా ఉంటుంది. కనెక్షన్ తీసుకున్న తర్వాత ఏసీ, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు మొదలైనవి కొనుగోలు చేస్తే లోడ్ అదనంగా వినియోగమవుతుంది. దీనివల్ల ట్రాన్స్‌ఫార్మర్లపై అధికభారం పడి విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, లో వోల్టేజీ, ఫ్యూజ్ పోవడం, ట్రాన్స్ ఫార్మర్లలో లోపాలు తలెత్తుతాయని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. అందువల్ల విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయకుండా.. అదనపు లోడును పెంచే విద్యుత్ ఉపకరణాలు కొనుగోలు చెయ్యొద్దని హెచ్చరిస్తున్నారు.

సర్వర్ డౌన్!



- మొరాయిస్తున్న స్కూల్ అటెండెన్స్ యాప్
- టీచర్ల హాజరు నమోదుకు తీవ్ర ఆటంకం
- ఎమ్మెల్సీ ఎన్నికల వేళ కూటమి కుయుక్తులు
- జిల్లాలో 3,474 మంది ఉపాధ్యాయులు
- యాప్‌లో 85 శాతమే హాజరు నమోదు

విశాఖ విద్య : కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు చుక్కలు చూపిస్తోంది. బయటకు మాత్రం తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్/స్కూల్ అటెండెన్స్(ఎస్ఐఎంఎస్(స్కూల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం)–ఏపీ) యాప్‌తో ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెడపై కత్తిపెడుతోంది. ప్రతి రోజూ క్రమం తప్పకుండా విధులకు హాజరవుతున్నా.. సాంకేతిక సమస్యలతో యాప్‌లో సవ్యంగా హాజరు నమోదు కాకపోవటంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుల విషయంలో ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరి మరింత దారుణంగా ఉంది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో టీచర్స్ అటెండెన్స్‌పై ప్రభుత్వం మరింత నిశిత పరిశీలన చేస్తోంది. కూటమి తరఫున పోటీలో ఉన్న రఘువర్మకు ఓటు వేయకపోతే.. ఫేషియల్ యాప్ లెక్క తీసి, ఏదో రీతిన చిక్కులు కల్పించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇలా చేస్తోందని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

జిల్లాలో టీచర్ల హాజరు ఇలా..

జిల్లాలోని 11 మండలాల్లో ఉన్న ప్రభుత్వ స్కూళ్లలో 3,474 మంది పనిచేస్తున్నారు. వీరిలో మంగళవారం నాడు 2,968 మంది విధులకు హాజరైనట్లు టీచర్స్ అటెండెన్స్ యాప్‌లో నమోదైంది. ఈ లెక్కన 85.43 శాతం మంది ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యారన్న మాట. వివిధ కారణాలతో 421(12.12 శాతం) మంది ఉపాధ్యాయులు సెలవు పెట్టారు. వైకల్యం గల 47 మంది ఉపాధ్యాయులకు యాప్ నుంచి వెసులుబాటు ఇచ్చారు.

మొరాయిస్తున్న యాప్

ఉపాధ్యాయులు పాఠశాల పనివేళల షెడ్యూల్ మేరకు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం యాప్‌లో ఫేషియల్ హాజరు నమోదు చేయాలి. ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్లలో ఉన్న స్కూల్ అటెండెన్స్ యాప్‌లో ఐడీ నంబర్, పాస్‌వర్డ్ ఉపయోగించి ఫేషియల్ హాజరు వేయాలి. ఇక్కడే ఉపాధ్యాయులకు ఇక్కట్లు మొదలవుతున్నాయి. ములగాడ మండలంలోని మారుమూల పాఠశాలల్లో నెట్‌వర్క్ సరిగా లేక మంగళవారం 80.92 శాతం హాజరు నమోదైంది. అటెండెన్స్ యాప్ తరచూ మొరాయిస్తుండటంతో పెందుర్తి, గోపాలపట్నం, సీతమ్మధార మండలాల్లో హాజరు నమోదుకు ఎక్కువ సమయాన్ని వెచ్చించాల్సి వస్తోందని ఉపాధ్యాయులు అంటున్నారు. దీంతో సకాలంలో విధులకు హాజరైనా, ఆలస్యమైనట్లుగా యాప్‌లో చూపిస్తుండటం వల్ల ఉన్నతాధికారులకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వస్తోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సర్వర్ డౌన్‌లో మర్మమేంటో..

ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఇబ్బందులకు గురిచేస్తుండటంపై ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇటీవల కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించిన సమయంలో కూడా సాయంత్రం 5.30 గంటల వరకు అటెండెన్స్ యాప్‌ను లాక్ చేశారు. దీంతో చీకట్లు చుట్టుముట్టినా కాంప్లెక్స్ కేంద్రాల్లోనే టీచర్లు నిరీక్షించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కూటమి ప్రభుత్వం చెప్పేది ఒకటైతే, చేసేది మరోలా ఉందని ఉపాధ్యాయులు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

ఇబ్బందులకు గురిచేయడం తగదు



కూటమి ప్రభుత్వం టీచర్లకు ఏదో మేలు చేస్తుందనే భావించాం. కానీ.. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడం తగదు. అటెండెన్స్ యాప్‌లో తరచూ సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి.

– ఇమంది పైడిరాజు, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి

భోజన పథకంపై తనిఖీలు

మాధవధార స్కూల్‌లో లోపాలు బట్టబయలు

సాక్షి ఎఫెక్ట్..



విద్యార్థులను లెక్కిస్తున్న సిబ్బంది, భోజనం రుచి చూస్తున్న తనిఖీ అధికారి

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరుపై జిల్లా విద్యాశాఖాధికారులు తనిఖీలు చేపట్టారు. 'రుచీ లేదు.. శుచీ లేదు' అనే శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం విద్యాశాఖ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ స్పందించి మాధవధార హైస్కూల్‌ను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి ఇద్దరు సీనియర్ అధికారులు, గోపాలపట్నం ఎంఈవో దివాకర్ మంగళవారం మాధవధార స్కూల్‌ను తనిఖీ చేశారు. ముందుగా భోజన పథకం నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో ఐదు రోజులుగా ఎంతమంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిన్నారనేది ఎండీఎం యాప్‌లో చూశారు. ఐదు రోజులుగా కేవలం ఒక్కరే భోజనం తినలేదని నిర్వాహకులు రికార్డుల్లో నమోదు చేసిన విషయాన్ని గుర్తించారు. దీంతో మంగళవారం పాఠశాలకు హాజరైన విద్యార్థుల సంఖ్య, భోజనం తిన్న విద్యార్థులను తరగతుల వారీగా లెక్కించారు. 630 మంది విద్యార్థులు బడికి హాజరైతే, వీరిలో 591 మంది భోజనం తీసుకున్నట్లుగా తేలింది. ఈ లెక్కన 39 మంది భోజనం తినలేదనేది వెల్లడైంది. దీన్ని బట్టి ఇక్కడి నిర్వాహకులు ఎండీఎం యాప్‌లో తప్పుడు నివేదికలను పొందుపరుస్తున్నట్లుగా గుర్తించారు. పరిశీలనలో వెల్లడైన అంశాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు వెల్లడించారు. ఒక్క మాధవధార స్కూల్లోనే ఇలా ఉందా? లేక జిల్లా వ్యాప్తంగా ఇదే రీతిన అంకెల గారెడీ జరుగుతుందా? అనేది లోతుగా పరిశీలించాలని పలువురు కోరుతున్నారు.

కోడ్ ఉల్లంఘన.. చీరలతో కవరింగ్!



చీరలు చుట్టిన పవన్ కల్యాణ్, వంశీకృష్ణ ఫ్లెక్సీ

జగదాంబ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలు, బ్యానర్లు నిషిద్ధం. పార్టీలకు సంబంధించిన నాయకుల విగ్రహాలకూ ముసుగులు తప్పనిసరి. అయితే విశాఖ దక్షిణ నియోజకవర్గం కూటమి నేతలకు ఇవేవీ పట్టడం లేదు. 35వ వార్డు, పూర్ణామార్కెట్ దరి దుర్గాలమ్మ జంక్షన్‌లో మహాశివరాత్రి శుభాకాంక్షలు పేరిట డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఫొటోలతో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. జనసందోహం మధ్య అందరికీ కనిపించేలా పెట్టిన ఈ ఫ్లెక్సీ అధికారుల కంట పడకపోవడం విడ్డూరంగా ఉందన్న ఆక్షేపణలున్నాయి. అధికార కూటమి నేతలైతే యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించవచ్చా అంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో అధికారులే చెప్పారో.. స్థానిక కూటమి నేతలకే తెలివొచ్చిందో.. తెలియదు కానీ.. ఇరువురు నేతల ముఖాల్ని కాస్త మరుగున పెట్టేలా రెండు చీరలు చుట్టడం చర్చనీయాంశమైంది.

డ్రగ్స్ నిర్మూలనకు చేతులు కలపాలి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ : విశాఖలో గంజాయి, సింథటిక్ డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్, ఆర్‌పీఎఫ్, ఎన్‌సీబీ, కస్టమ్స్, పోర్టు, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో చేతులు కలపాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీతో కలిసి ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో మత్తు పదార్థాల రవాణా నియంత్రణపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీపీఎస్ కేసుల్లో అరెస్టయిన 700 మందిలో 400 ఎస్టీలే ఉన్నారని తెలిపారు. కేవలం రూ.వెయ్యి, రూ.2 వేలు కోసం రవాణా చేస్తూ దొరికిపోయి జైలులో నెలల తరబడి ఉండిపోతున్నారని పేర్కొన్నారు. వారికి బెయిల్‌కు ఎలా దరఖాస్తు చేసుకోవాలో కూడా తెలియదన్నారు. తొలిసారిగా ఎన్‌డీపీఎస్ కేసులో అరెస్టయిన అల్లూరి జిల్లాకు చెందిన వారికి తొలుత బెయిల్ ఇవ్వాలన్నారు. దీనిపై పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ ఒడిశా, అల్లూరి జిల్లా నుంచి గంజాయి వస్తోందన్నారు. కొందరు కింగ్‌పిన్‌లు ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు ఆశ కల్పిస్తున్నారని, ఫలితంగా గిరిజన రైతులు గంజాయి సాగుపై ఆకర్షితులవుతున్నారని వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వారికి కాఫీ విత్తనాలు, మిరియాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

గోవా, కర్ణాటక నుంచి సింథటిక్ డ్రగ్స్

సింథటిక్ డ్రగ్స్ గోవా, కర్ణాటక నుంచి నగరంలోకి వస్తున్నట్లు సీపీ తెలిపారు. గంజాయి చాక్లెట్లు బిహార్ నుంచి వస్తున్నట్లు తమ దర్యాప్తులో వెల్లడైందని, అలాగే ఉత్తరప్రదేశ్‌లో వాటిని తయారు చేస్తున్నట్లు గుర్తించామని వివరించారు. విశాఖ పోలీసులు అక్కడకు వెళ్లి వారిపై చర్యలు తీసుకోవడమే కాకుండా ఆ పరిశ్రమను సీజ్ చేయించినట్లు చెప్పారు. ఏజెన్సీ నుంచి గంజాయితో పాటు ఇతర డ్రగ్స్‌ను విశాఖ నుంచి పది సంప్రదాయ మార్గాల ద్వారా దేశంలో ఇతర ప్రాంతాలకు రవాణా జరుగుతున్నట్లు తెలిపారు. గంజాయిని కొరియర్ ద్వారానే కాకుండా విమానాల ద్వారా కూడా రవాణా చేసినట్లు సమాచారం ఉందని వెల్లడించారు. ఇప్పటికే గంజాయి రవాణాదారులను అరెస్టులు చేశామని, ప్రస్తుతం కోర్టుల్లో 134 ఎన్‌డీపీఎస్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని వచ్చే నెలలో ధ్వంసం చేయనున్నట్లు తెలిపారు.

ఐదుగురిపై పీడీ యాక్ట్ అమలు

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో ఏడుగురిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సీపీ పేర్కొన్నారు. వీరిలో ఐదుగురిపై పీడీ యాక్ట్ అమలుకు ఉత్తర్వులు కూడా జారీ అయినట్లు చెప్పారు. మరికొంత మందిపై కూడా ఈ చట్టాన్ని అమలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

పోలీస్ శాఖలో సిబ్బంది కొరత ఉందన్నారు. గంజాయి రవాణా అడ్డుకట్టకు ప్రత్యేకంగా కేటాయించిన సిబ్బందిని కూడా బందోబస్తు సమయాల్లో వెనక్కి తీసుకోవాల్సి వస్తోందని తెలిపారు. రవాణాదారులు శివారు ప్రాంతాల్లోని ఖాళీ గొడౌన్లు, గుడిసెలలో గంజాయిని నిల్వ చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. డ్రగ్స్ గ్యాంగ్‌లో కింగ్ పిన్‌లను గుర్తించి, వారిని అరెస్టులు చేసి, వారి ఆస్తులను జప్తు చేయడంపై దృష్టి సారించామన్నారు.

• ప్రకృతి ఒడిలో విశాఖ





విశాఖ నగరం ప్రకృతి అందాలకు నెలవు. చుట్టూ పచ్చని కొండలు.. ఉవ్వెత్తున ఎగిసిపడే అలలు.. ఈ అద్భుత దృశ్యాలు విశాఖకే సొంతం. యారాడ డాల్ఫిన్ నోస్ నుంచి చూస్తే ప్రకృతి రమణీయత మరింతగా కనువిందు చేస్తుంది. ఒక వైపు ఓడరేవు, మరోవైపు పచ్చని కొండల నడుమ ఈ సుందర దృశ్యాన్ని వర్ణించలేం..అనుభవించాల్సిందే! డాల్ఫిన్ నోస్ దగ్గర్లోనే ఉన్న లైట్‌హౌస్ మరో ఆకర్షణ. రోజూ ఎంతోమంది పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. ప్రభుత్వ గుర్తింపు కార్డు ఉంటే సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు లైట్‌హౌస్‌లోకి అనుమతిస్తారు. టికెట్ ధర కేవలం రూ.20 మాత్రమే. విశాఖ సహజ సౌందర్యాన్ని 'సాక్షి'కెమెరా క్లిక్ మనిపించింది.

-ఏయూక్యాంపస్/ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



శంభో శివం శంకరం

మహా శివరాత్రికి శైవక్షేత్రాలు సర్వం సిద్ధం



విద్యుత్ దీపాల కాంతుల్లో సోమేశ్వరస్వామి ఆలయం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, పోలీస్ అధికారులు



ఆలయం ఎదుట వేసిన టెంట్లు

పెదగంట్యాడ: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలు మహా శివరాత్రి వేడుకలకు సిద్ధమయ్యాయి. అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం, నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం, సీతంపేటలోని పార్వతీశ్వర ఆలయం తదితర జిల్లాలోని శైవక్షేత్రాలు విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీలు విస్తృత ఏర్పాట్లు చేపట్టాయి. ఆలయాల్లో రుద్రాభిషేకం, తదితర ప్రత్యేక పూజలతో పాటు శివపార్వతుల కల్యాణోత్సవం కనులపండువగా జరగనుంది.

అప్పికొండ సోమేశ్వరస్వామి సర్వం సిద్ధం

జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇక్కడ జరిగే తీర్థానికి లక్షలాది మంది భక్తులు తరలిరానుండడంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా ఏర్పాట్లను మంగళవారం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, తహసీల్దార్ అమల, గాజువాక ఏసీపీ త్రినాథ్, జోనల్ కమిషనర్ శేషాద్రి, దేవదాయ ధర్మాదాయ శాఖాధికారులు పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఇక్కడ వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాలు కేటాయించారు. శివరాత్రి మరుసటి రోజు భక్తులు ఇక్కడి సముద్ర తీరంలో స్నానాలు ఆచరించేందుకు అనువుగా ఏర్పాట్లు చేపట్టారు. 500 ఏళ్ల చరిత్ర ఉన్న సోమేశ్వరస్వామి ఆలయంలో ఏటా తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కాగా.. ఈ నెల 26న వేకువజామున 5 గంటలకు స్వామికి నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. సాయంత్రం నుంచి భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు నీడ కోసం టెంట్లు వేశారు. కూలు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా 100 బస్సులు నడుపుతోంది.

సివిల్ డిఫెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా జ్యోతిమాధవి

సాక్షి, విశాఖపట్నం: జిల్లా సివిల్ డిఫెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఎస్.జ్యోతిమాధవిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె జిల్లా మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ విధుల నుంచి తప్పించి.. డిఫెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించినట్లు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శివాలయంలో నాగుపాము



శివలింగం వద్ద పామును పట్టుకున్న దివ్య కాంత్

కంచరపాలెం: కంచరపాలెం పరిధి రవీంద్రనగర్ గ్రీన్ బెల్ట్‌లోని నూకాంబిక అమ్మవారి ఆలయానికి వెలుపల గల శివాలయంలో మంగళవారం రాత్రి నాగుపాము కనిపించింది. మహా శివరాత్రికి ఆలయాన్ని ముస్తాబు చేసే పనిలో నిర్వాహకులు నిమగ్నమై ఉండగా.. అదే సమయంలో నాగుపాము శివలింగం చుట్టూ ప్రదక్షిణలు చేసింది. ఇది గమనించిన స్థానికులు పాముకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్నేక్ క్యాచర్ దివ్యకాంత్‌కు సమాచారం ఇవ్వడంతో.. ఆయన నాగుపామును పట్టుకుని జనసంచారం లేని ప్రాంతంలో విడిచిపెట్టారు.



రేపు పారిశుధ్య కార్మికులకు సెలవు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు మహాశివరాత్రి నాడు కాకుండా మరుసటి రోజున(ఈ నెల 27) సెలవు ప్రకటించినట్లు జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ పేర్కొన్నారు. ఆ రోజున వ్యర్థాలను వీధులు, బహిరంగ ప్రదేశాలు, పబ్లిక్ బిన్లలో పడవేయకుండా తమ ఇంటి వద్దనే ఉంచుకుని, 28న విధులకు హాజరయ్యే పారిశుధ్య సిబ్బందికి అందించాలని విజ్ఞప్తి చేశారు.

వేర్వేరు కేసుల్లో నలుగురి అరెస్ట్

- సొత్తు స్వాధీనం
- నిందితుల్లో ఇద్దరు మైనర్లు



వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఏడీసీపీ మోహనరావు, ఏసీపీ లక్ష్మణరావు

అల్లిపురం: దోపిడీ, దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు మైనర్లు సహా నలుగురు నిందితులను నగర పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.39,350 నగదు, పావు తులం చెవ్వలీలు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో క్రైం ఏడీసీపీ కె.మోహనరావు, జోన్-2 ఏసీపీ డి.లక్ష్మణరావుతో కలసి వివరాలు విలేకరులకు వివరాలు వెల్లడించారు.

టూటౌన్ పరిధిలో..

గుంటూరు జిల్లా వెంగళాయపాలేనికి చెందిన మజ్జూరు శాకుంతల లక్ష్మీలావణ్య ఈ నెల 16వ తేదీన తన చెల్లి పెళ్లి కోసం అల్లిపురం, కెప్టెన్ రామారావు జంక్షన్‌లో నివసిస్తున్న పుట్టింటికి వచ్చింది. మర్రిపాలెంలో జరుగుతున్న పెళ్లికి అందరూ తలుపులు వేసుకుని వెళ్లిపోయారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం విరగొట్టి ఉంది. ఇంటి లోపలికి వెళ్లిచూడగా బీరువాలో ఉంచిన రూ. 1.7 లక్షల నగదు, పావు తులం చెవ్వలీలు పోయినట్లుగా గుర్తించారు. దీంతో ఆమె టూటౌన్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడు మర్రిపాలేనికి చెందిన షేక్ ఖాదర్ బాషాగా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రూ.39 వేలు నగదు, పావు తులం చెవ్వలీలు స్వాధీనం చేసుకున్నారు.

త్రీ టౌన్ పరిధిలో..

దారిదోపిడీకి పాల్పడిన ఇద్దరు మైనర్లతో సహా ఒక వ్యక్తిని త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.350 నగదు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పెదవాల్తేరు మగధ ఎంపైర్ అపార్ట్‌మెంట్స్‌కు చెందిన మైలపల్లి చంద్రరావు ఈ నెల 22వ తేదీన తెల్లవారుజాము 4.30 గంటల సమయంలో ఫిషింగ్ హార్బర్ జెట్టీ వైపు వెళ్తున్నాడు. ఈస్ట్‌పాయింట్ కాలనీ, పార్క్‌లైన్ అపార్టుమెంట్‌కు సమీపంలో ముగ్గురు బైక్‌పై వచ్చి అతడిని బెదిరించి పక్కకు తోసేసి రూ.350 నగదు, ఒక సెల్ ఫోన్ లాక్కొని పరారయ్యారు. కింద పడిన అతడి తలకు గాయం కావడంతో కేజీహెచ్‌కు వెళ్లి చికిత్స పొందాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులలో ఇద్దరు మైనర్లు, మరో నిందితుడు చినగదిలికి చెందిన తీడ మొనీష్‌బాబుగా గుర్తించి వారిని డాబాగార్డెన్స్‌లో అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మైనర్లను హోమ్‌లో చేర్పించారు. సీఐ కోరాడ రామారావు, ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం ఇన్‌చార్జ్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు, త్రీ టౌన్ క్రైం ఎస్ఐ సల్మాన్ బేగ్, టూటౌన్ క్రైం ఎస్ఐ సునీల్, హోంగార్డులు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సులభంగా విద్యుత్ బిల్లుల చెల్లింపు



పేమెంట్ గేట్ వేను ఆవిష్కరిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, యూనియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ షాలినీ మీనన్

ఈపీడీసీఎల్, యూనియన్ బ్యాంక్ సంయుక్తంగా పేమెంట్ గేట్‌వే ప్రారంభం

సీతమ్మధార: ఏపీఈపీడీసీఎల్, యూనియన్ బ్యాంకు సంయుక్తంగా ప్రవేశపెట్టిన పేమెంట్ గేట్‌వే ద్వారా విద్యుత్ వినియోగదారులు సులభంగా బిల్లులు చెల్లించవచ్చని ఆ బ్యాంకు జోనల్ మేనేజర్ షాలినీ మీనన్ తెలిపారు. గురుద్వారాలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడితో కలిసి ఆమె 'పేమెంట్ గేట్‌వే'ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రముఖ పేమెంట్ టెక్నాలజీ అనుసంధానంలో ఈ పేమెంట్ గేట్‌వే సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఇది ప్రస్తుతం 'ఆన్‌లైన్ వెబ్ పోర్టల్' ద్వారా అందుబాటులోకి తెచ్చామని, త్వరలో మొబైల్ యాప్ ద్వారా సేవలందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం, సీజీఎం ఫైనాన్స్ పి.వెంకటేశ్వరరావు, సీజీఎం ఐటీ పి.శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్ ఫైనాన్స్ కె.అరుణ, యూనియన్ బ్యాంకు అధికారులు ఎల్.సుధాకర్ రావు(ఏజీఎం), చీఫ్ మేనేజర్ అబ్దుల్ అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

'లాంగ్ డిస్టెన్స్'లో వేదవ్యాస్‌కు కాంస్యాలు



విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన లాంగ్ డిస్టెన్స్ రన్నర్ వేదవ్యాస్ రెండు కాంస్య పతకాలను సొంతం చేసుకున్నాడు. చండీగఢ్‌లో జరిగిన ఈ పోటీల్లో భాగంగా ఐదు కిలోమీటర్ల పరుగును 16.47 నిమిషాల్లో పూర్తి చేశాడు. అలాగే 10 కిలోమీటర్ల పరుగును 34.55 నిమిషాల్లో పూర్తి చేసి కాంస్య పతకాలను సాధించాడు. ఇటీవల జరిగిన స్టేట్ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించాడు. 2022 నుంచి సౌత్ జోన్ జూనియర్ స్టేట్ అథ్లెటిక్ మీట్‌లో క్రమం తప్పకుండా పాల్గొంటూ.. 2024 వరకు మూడు స్వర్ణాలు, ఒక రజతం, రెండు కాంస్యాలను అందుకున్నాడు.

మాస్టర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌గా ఉషశ్రీ



సీతంపేట: నగరానికి చెందిన క్రీడాకారిణి పెద్దిశెట్టి ఉషశ్రీ ఏపీ స్టేట్ మాస్టర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌గా నిలిచారు. విజయవాడ క్లబ్ మైదానంలో సోమవారంతో ముగిసిన ఏపీ స్టేట్ మాస్టర్స్ చాంపియన్‌షిప్‌లో సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్, వుమెన్స్ డబుల్స్ విభాగాల్లో ఆమె అద్భుత ప్రతిభ చూపారు. వుమెన్స్ సింగిల్స్ 50+లో విజయవాడకు చెందిన ఇంద్రాణిని ఓడించారు. మిక్స్‌డ్ డబుల్స్ 50+లో బీవీఎస్‌కే లింగేశ్వరరావుతో కలిసి బరిలోకి దిగిన ఉషశ్రీ విజయం సాధించగా, వుమెన్స్ డబుల్స్‌లో విజయవాడకు చెందిన పద్మతో జతకట్టి విజయకేతనం ఎగురవేశారు. ట్రిపుల్ క్రౌన్ అందుకుని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఆమెను పలువురు క్రీడాకారులు అభినందించారు.

రైల్వేస్టేషన్‌లో డీఆర్‌ఎం ఆకస్మిక తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోరా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం లలిత్ బోరా మంగళవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్టేషన్ పరిశుభ్రత, కోచ్‌ల నిర్వహణ, ప్రయాణికుల రద్దీ వంటి విషయాలను పరిశీలించారు. ప్రయాణికులు వేచి ఉండే ప్రదేశాలు, సాధారణ బుకింగ్ కౌంటర్లు, పాదచారుల వంతెనలు, ఎస్కలేటర్స్, లిఫ్ట్స్, ప్లాట్‌ఫాంలు, కేటరింగ్ స్టాళ్లను సందర్శించారు.

పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్.ఎస్.రావు

- గెయిల్ సీజీఎం ఎల్.ఎస్.రావు
- ముగిసిన ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్

అక్కిరెడ్డిపాలెం: ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో వాసీవా సహకారంతో వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఆటోనగర్‌లోని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆఫీస్‌లో నిర్వహించిన బయ్యర్ అండ్ సెల్లర్ మీట్, ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ మంగళవారంతో ముగిసింది. రెండు రోజుల పాటు నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్.ఎస్.రావు, ఎంఎస్ఎంఈ(తెలంగాణా) జాయింట్ డైరెక్టర్ ఎస్.హెచ్.ఆంజనేయ మాట్లాడుతూ గెయిల్‌లో జరిగిన వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలను ఎంతగానో ప్రోత్సహించామన్నారు. పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ(పీపీపీ) ద్వారా సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌లో ఎంఎస్ఎంఈ పలు కరెక్షన్లకు సహకరిస్తుందన్నారు. జెమ్ పోర్టల్‌లో ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఎగ్జిబిషన్‌లో సహకారం అందించిన సిడ్బి, వాసీవా, ఎన్ఆర్‌డీసీ తదితర ప్రతినిధులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఎంఎస్ఎంఈ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కె.ఎల్.ఎస్.రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డీజీఎం (మెయింటనెన్స్) గౌరీ శంకర్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ అనంతలక్ష్మి, ఎంఎస్ఎంఈ - డీఎఫ్‌వో ఐఈడీ ఎస్ సీనియర్ మేనేజర్ ఎస్.ఎల్.ఎన్.కుమార్, వాసీవా సంయుక్త కార్యదర్శి ఈరుపుగంటి అనార్‌బాబు, ఎంఎస్ఎంఈ ఏడీలు శ్రీను అప్పికొండ, బి.ప్రభాకర్‌కుమార్, వీరయ్య, ఇన్‌చార్జి ఏడీ చంద్రమౌళి పాల్గొన్నారు.

అనుమతి లేని హోర్డింగ్‌లు తొలగించండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

విశాఖ సిటీ: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సూచించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో మంగళవారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో కలిసి రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. గతేడాది విశాఖలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మరణాలు, క్షతగాత్రుల వివరాలతో పాటు వారికి ప్రభుత్వం తరపున అందించిన ఆర్థిక సాయం వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గుర్తు తెలియని వాహనాల ద్వారా ప్రమాదానికి గురైన బాధితులకు అందుతున్న పరిహారంపై చర్చించారు. పాఠశాల, కళాశాలల పరిసర ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అవసరమైన చోట బస్ షెల్టర్ల ఏర్పాటుతో పాటు భారీ వాహనాలు నిలిపేందుకు ట్రక్ బేల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో అనుమతించిన హోర్డింగ్‌లు మాత్రమే ఉండాలని, ప్రమాదకరమైన, అనుమతి లేని హోర్డింగులు, బ్యానర్లు, ఇతర ప్రకటనలను తొలగించాలని ఆదేశించారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురి కాకుండా, ప్రజలు వినియోగించుకునేలా పోలీస్, జీవీఎంసీ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధాన కూడళ్లతో పాటు అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు మధ్యలో ఉన్న చెట్ల వల్ల వాహనచోదకులకు లైటింగ్ ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో జిల్లా రవాణా అధికారి సి.హెచ్.శ్రీనివాసరావు, డీసీపీ-2 మేరీ ప్రశాంతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

డాబాగార్డెన్స్: ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకాతిరుమలరావు మంగళవారం ద్వారకా బస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఫిర్యాదుల స్వీకరణకు నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ విధానంపై చర్చించారు. ప్రయాణికుల సూచనలు, సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ.. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం బస్‌స్టేషన్ ఆవరణ, బస్సులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో పరిశుభ్రత, బస్సుల సమయపాలన, తాగునీటి సరఫరా గురించి ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. స్టాళ్లను తనిఖీ చేసి, నాణ్యమైన వస్తువులను నిర్ణయించిన ధరకు మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు. విజయనగరం జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయకుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పీబీఎంకే రాజు తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సందర్శన

బస్‌స్టేషన్ ప్రాంగణంలోని హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌ను ద్వారకా తిరుమలరావు సందర్శించారు. యువతలో నైపుణ్యాలు పెంపొందించే విధంగా శిక్షణ తరగతులు నిర్వహించడం, ఉపాధి కల్పించడం గొప్ప విషయమన్నారు. ఆర్టీసీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఐవీవీపీ దుర్గాప్రసాద్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ సీఈవో ఇంతియాజ్ అహ్మద్, సీనియర్ మేనేజర్ కేఆర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆతిథ్య రంగంలో వ్యర్థాల నిర్వహణ కీలకం

కలెక్టర్ హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఏయూక్యాంపస్: వ్యర్థ పదార్థాల నిర్వహణ, సుస్థిర వ్యర్థ నిర్వహణ విధానాలను ఆతిథ్య రంగంలో అమలు చేయడం ఎంతో అవసరమని కలెక్టర్ ఎన్.ఎం.హరేందిర ప్రసాద్ అన్నారు. ఈ విధానాలు వ్యాపారాలు, ప్రజారోగ్యంపై చూపే ప్రభావాన్ని ఆయన వివరించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ సిస్టంపై అవగాహన వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వనరుల్లో కాలుష్యం చేరకుండా నివారించడం, సురక్షిత పారిశుధ్య పద్ధతులను అనుసరించే ఆతిథ్య సంస్థలకు రేటింగ్ ఇవ్వడం, ద్వారా పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడం స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ సిస్టం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ రేటింగ్ వ్యవస్థలో 1 లీఫ్, 3 లీఫ్,5 లీఫ్ అనే మూడు స్థాయి ఉంటాయని, ఇందులో 5 లీఫ్ అత్యధిక రేటింగ్ అని వెల్లడించారు. స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ సిస్టమ్‌లో పాల్గొనడం ద్వారా హోటల్ యజమానులు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పర్యావరణానికి తోడ్పడటమే కాకుండా.. వారి వ్యాపార ప్రతిష్టను కూడా మెరుగుపరచుకోవచ్చని కలెక్టర్ సూచించారు. జెడ్పీ సీఈవో నారాయణమూర్తి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సోమన్నారాయణ, హోటలియర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పవన్ కార్తీక్, టూరిజం అధికారులు పాల్గొన్నారు.

విశాఖ-పలాస పాసింజర్ గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-పలాస-విశాఖపట్నం(67289/67290) పాసింజర్‌ను మార్చి 2 నుంచి 8వ తేదీ వరకు(శుక్ర, ఆదివారాలు మినహా) గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ రోజుల్లో శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే ఈ రైలు నడుస్తుంది. అక్కడి నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటుంది. శ్రీకాకుళం రోడ్-పలాస మధ్య రాకపోకలు ఉండవు.